### స్కంద మాతగా
## వనదుర్గా అమ్మవారు

పాపన్నపేట, అక్టోబర్ 7:ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ఏడుపాయల వన దుర్గాభవాని మాత సన్నిధిలో శరన్నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. ఐదో రోజైన సోమవారం పంచమిని పురస్కరించుకుని స్కంద మాత రూపంలో పెసర రంగు పట్టు వస్త్రంతో మహాలక్ష్మీ అవతరంలో అమ్మవారు దర్శనమిచ్చారు. గోకుల్ షెడ్‌లోనూ అమ్మవారిని స్కందమాతగా పెసరరంగు పట్టు వస్త్రంతో అలంకరించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఈవో చంద్రశేఖర్ ఏర్పాట్లు చేశారు. మంగళవారం వన దుర్గాదేవి అమ్మవారికి బోనాలు సమర్పించనున్నట్లు ఈవో పేర్కొన్నారు.




స్కంద మాతగా పూజలు అందుకుంటున్న వనదుర్గా అమ్మవారు


నమస్తే తెలంగాణ

# సంగారెడ్డి

I హైదరాబాద్, మంగళవారం 8 అక్టోబర్ 2024 SANGAREDDY

వర్గల్ సరస్వతీ మాత ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు(ఇన్‌సెట్‌లో) అన్నపూర్ణాదేవిగా అమ్మవారు

## సరస్వతీ మాత సన్నిధిలో హరీశ్‌రావు పూజలు

వర్గల్, అక్టోబర్ 7: సిద్దిపేట జిల్లా వర్గల్ విద్యాధరి క్షేత్రంలో జరుగుతున్న దేవీశరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని సోమవారం మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు సరస్వతీమాతను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా హరీశ్‌రావుకు ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు యాయవరం చంద్రశేఖరశర్మ సిద్ధాంతి నేతృత్వంలో వేద పండితులు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా అమ్మవారి శేషవస్త్రాలు, కంకణధారణ,తీర్థ ప్రసాదాలు స్వీకరించి అన్నదానంలో పాల్గొన్నారు. ఉత్సవాల్లో భాగంగా ఐదోరోజు సరస్వతీమాత అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. మంగళవారం మహాలక్ష్మీ రూపంలో దర్శనమివ్వనున్నట్లు ఆలయ వర్గాలు తెలిపాయి.కార్యక్రమంలో మెదక్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ యాదవరెడ్డి, బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి, వర్గల్ ఫ్యాక్స్ చైర్మన్ రామకృష్ణారెడ్డితో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

- కోడికూయక ముందే తాగుడు షురూ
- బార్లను తలపిస్తున్న బెల్ట్ షాపులు
- గుట్టుగా కల్తీ మద్యం అమ్మకాలు
- వైన్స్‌లకు టార్గెట్‌తో విచ్చలవిడిగా వెలుస్తున్న బెల్ట్‌షాపులు
- అధిక ధరలకు మద్యం విక్రయాలు
- ఎక్సైజ్ అధికారులకు కాసుల గలగల
- మామూళ్ల కోసం ప్రత్యేక టీంలు ఏర్పాటు

# ఫుల్ కిక్..!



సిద్దిపేట,సెప్టెంబర్ 7 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): గ్రామాల్లో కోడి కూయకముందే మద్యం ఏరులై పారుతున్నది. ఊరూరా ఎంత లేదన్నా (చిన్న గ్రామం అయితే) నాలుగు నుంచి ఐదు బెల్ట్‌షాపులు కొనసాగుతున్నాయి. పెద్ద గ్రామాలు ఐతే రెట్టిం పు స్థాయిలో నడుస్తున్నాయి. అడ్డుకునే వారే అండదండలు అందించడంతో గ్రామాల్లో జోరుగా బెల్ట్‌షాపులు నిర్వహిస్తున్నారు. వైన్స్ యజమానుల కనుసన్నల్లో ఈ బెల్ట్‌షాపులు నిర్వహిస్తున్నారు. వైన్స్ షాపులు, బెల్ట్ షాపుల కేంద్రంగా కల్తీ మద్యం అమ్ముతూ అందినకాడికి దోచుకుంటున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. వైన్స్‌లో కల్తీ మద్యం అమ్ముతున్నా పట్టించుకునే వారే కరువయ్యారు. సిద్దిపేట, సంగారెడ్డి, మెదక్ జిల్లాలోని గ్రామాల్లో మద్యం యథేచ్ఛగా అమ్ముతున్నారు. పోలీసులు, ఎక్సైజ్‌శాఖ అధికారులు వైన్స్ యజమానులు, బెల్ట్‌షాపుల నుంచి ప్రతి నెలా డబ్బులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ప్రతి నెలా వైన్స్ యజమానులు, బెల్ట్‌షాపు దుకాణాలు నిర్వహించే వారి నుంచి వసూలు చేయడానికి ప్రత్యేకంగా పోలీసు, ఎక్సైజ్‌శాఖలో ఒక టీం ఏర్పాటు చేసుకున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. వైన్స్‌లో కల్తీ మద్యం అమ్ముతున్నారా..? మంచిదేనా..? అని కనీసం చూడడం లేదు. పూర్తిగా ఎక్సైజ్‌శాఖ అధికారులు మామూళ్లకే పరిమితమయ్యారు తప్పా మరోటి లేదన్న విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. మామూళ్లతో ఎక్సైజ్‌శాఖ అధికారులకు కాసుల వర్షం కురుస్తున్నది.

### నిబంధనలు గాలికి...

సిద్దిపేట జిల్లాలో 93 మద్యం దుకాణాలు, మెదక్ జిల్లాలో 49, సంగారెడ్డి జిల్లాలో 102 వైన్‌షాపులు నడుస్తున్నాయి. ఈమద్యం దుకాణాల యజమానులు నిబంధనలను గాలికి వదిలేశారు. ఎక్సైజ్‌శాఖనే తమ జేబులో ఉంది, ఇక నిబంధనలు అమలు చేసేది ఏందీ అంటూ యథేచ్ఛగా కల్తీ మద్యం అమ్ముతున్నారు. మద్యం దుకాణాలు ఉదయం 10గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు తెరిచి ఉంచాలి కానీ నిబంధనలు అతిక్రమించి రాత్రి వరకు తెరిచి ఉంటున్నాయి. కొన్ని ప్రత్యేక సందర్భాలు ఉన్నప్పుడు వైన్స్‌లను బంద్ చేయాలి కానీ పక్కనే చిన్నపాటి రూమును కిరాయికి తీసుకొని అందులో మద్యం ఉంచి అమ్ముతున్నారు. మద్యం దుకాణం ముందు ఇష్టారీతిగా వాహనాలను పార్కింగ్ చేస్తున్నారు. ఆరహదారి గుండా పోయేవారికి తీవ్ర ఇబ్బంది ఎదురవుతున్నది. ప్రతి మద్యం దుకాణానికి ఒక గదిని మద్యం తాగడానికి ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. అక్కడ గది లేకపోతే మద్యం కొనుగోలు చేసి తీసుకొని పోవాల్సి ఉంటుంది. కానీ మద్యం ప్రియులు రోడ్డు మీదనే తాగేస్తూ బాటసారులకు ఇబ్బంది కలిగిస్తున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి మద్యం దుకాణాల ముందు ఏం జరుగుతుంది అనే విషయాన్ని పర్యవేక్షణ చేయాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదు. సాయంత్రం అయిందంటే చాలు మద్యం దుకాణాలు జాతరను తలపిస్తున్నాయి. రాత్రి 10 తర్వాత మద్యం విక్రయాలను బెల్ట్‌షాపుల ద్వారా వైన్స్ యజమానులు నిర్వహిస్తున్నారని స్థానికులు వాపోతున్నారు. వయస్సుతో సంబంధం లేకుండా పిల్లలకు సైతం మద్యం అమ్ముతున్నారు. అనేకచోట్ల రోడ్ల వెంట ఉన్న దుకాణాల్లో మద్యం కొనుగోలు చేసి రోడ్లపైనే తాగేస్తుండడంతో ట్రాఫిక్ సమస్యలు ఎదురవుతున్నాయి. బెల్ట్‌షాపుల్లో క్వార్టర్‌కు రూ.30 నుంచి రూ.40 వరకు, ఆఫ్ బాటిల్‌కు రూ.60, ఫుల్ బాటిల్‌కు రూ.100 పైనే వసూలు చేస్తున్నారు. మద్యాన్ని బట్టి అందినకాడికి దోచుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

### పల్లెపల్లెనా ఏరులై పారుతున్న మద్యం



సిద్దిపేట పట్టణంలోని ఒక బెల్ట్ షాపు వద్ద లోపల మందు.. బయట బండ్లు

#### బెల్ట్ షాపులకు
### నిత్యం మద్యం తరలింపు

గ్రామాల్లో బెల్ట్‌షాపులు నిర్వహించే వారు రోజూ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా లక్షల్లో మద్యాన్ని తరలించి అధిక ధరలకు అమ్ముతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వైన్స్‌షాపు యజమానుల పర్యవేక్షణలో బెల్ట్‌షాపులు నిర్వహిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. వైన్స్ యజయానులే గ్రామాల్లో మద్యం దుకాణాలు పెట్టించి దందా కొనసాగిస్తున్నారు. ఇక్కడి నుంచే రకరకాల కల్తీ మద్యాన్ని అమ్ముతున్నారు. వివిధ బ్రాండ్‌లకు చెందిన వాటికి సీల్ యథావిధిగానే ఉంటుంది. ఆసీల్ పాడవకుండా విప్పి దాంట్లో కల్తీ మద్యం నింపుతున్నారు. ఈ దందా ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా జోరుగా జరుగుతోంది. ఇదంతా తెలిసినా తమకు ఏంతెలియదు అన్నట్లుగా ఎక్సైజ్‌శాఖ అధికారులు వ్యవహరిస్తున్నారు. వీరికి ప్రతి నెలా అందాల్సిన మాముళ్లు అందుతున్నాయి. ఇక వారికి ఏంపని అన్నట్లుగా ఉంది. బెల్ట్‌షాపులకు ఎలాంటి అనుమతి ఉండదు. ఇంకాస్త ముందుకు వెళ్తే మరి కొన్ని చోట్ల వింతగా ఉంది..బెల్ట్‌షాపులపై మండల కేంద్రం, పట్టణాల్లో ఉన్న వైన్స్ వ్యాపారుల నిబంధనలు విధిస్తున్నారు. జిల్లాలోని ఒక మండల పరిధిలోకి వచ్చే గ్రామాల్లో కొనసాగుతున్న బెల్ట్ షాపులు అదే మండలంలో ఉన్న వైన్ షాపుల్లో మద్యం కొనుగోలు చేసి గ్రామాల్లో విక్రయించుకోవాలి. దీనికి భిన్నంగా ఎవరైనా బెల్ట్‌షాపు నిర్వాహకుడు మరో మండలంలో మద్యం కొనుగోలు చేసి తన షాపులో విక్రయిస్తున్నట్లు తెలిస్తే వైన్‌షాపుల నిర్వాహకులు వారిని ఎక్సైజ్ పోలీసులకు పట్టించి కేసులు నమోదు చేయిస్తున్నారు.ఎక్కడి మందు తీసుకువచ్చి విక్రయాలు జరుపుతున్నారనే విషయాలు తెలుసుకునేందుకు వైన్‌షాపుల వారీగా ఒక్కో రైడింగ్ టీం ఏర్పాటు చేసి సదరు టీం ద్వారా మద్యం షాపుల వారు వ్యాపారం కొనసాగిస్తున్నారు.బెల్ట్‌షాపుల వారు మండల కేంద్రంలో ఉన్న షాపు నుంచి మద్యం కొనుగోలు చేసి అమ్మకపోతే వారిని ఎక్సైజ్ శాఖ అధికారులకు వైన్‌షాపువారు పట్టిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.



సిద్దిపేటలో సన్మానం పొందిన విద్యార్థులతో ఎమ్మెల్యే హరీశ్‌రావు

## విద్యార్థులకు హరీశ్‌రావు అభినందనలు

సిద్దిపేట,అక్టోబర్ 7: కేఆర్ కెరీర్ గైడెన్స్‌లో శిక్షణ పొంది ర్యాంకులు సాధించిన విద్యార్థులకు మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు అభినందనలు తెలిపారు. సోమవారం సిద్దిపేటలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కేఆర్ ఇంజినీరింగ్ గైడెన్స్ సంస్థలో ఐఐటీ, ఎన్ఐటీ శిక్షణ పొందిన సుమారు 200 మంది విద్యార్థులకు ఆయన సన్మానం చేశారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ..2020లో కేఆర్ కెరీర్ గైడెన్స్ సెంటర్‌ను ప్రారంభించామన్నారు. మెదట్లో కొంత సంశయం ఉండేది. కానీ, తొందరగానే ఉత్తమ ఫలితాలు వచ్చాయన్నారు. ప్రభుత్వ ఉపాధ్యాయుడు రాములు ఒకవైపు ఉద్యోగం చేస్తూనే ఉచితంగా పిల్లలకు సేవ చేయడం అభినందనీమన్నారు. అందరూ ఆయనను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.




హుస్నాబాద్ టౌన్: బహుజన బతుకమ్మ వేడుకల్లో మాట్లాడుతున్న అరుణోదమ సాంస్కృతిక సారథి నాయకురాలు విమలక్క, పక్కన మంత్రి పొన్నం ప్రభాకర్

## వైభవంగా బహుజన బతుకమ్మ

హుస్నాబాద్‌టౌన్, అక్టోబర్ 7: సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో సోమవారం రాత్రి బహుజన బతుకమ్మ వేడుకలు జరిగాయి. పలువురు మహిళలు బతుకమ్మ పాటలు పాడుతూ నృత్యాలు చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమం, రవాణా శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ తెలంగాణలో జరిగే పూల పండుగ మనకు తరతరాలుగా వస్తుందన్నారు. మన వనరులను మనం కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. విమలక్క మాట్లాడుతూ బహుజన బతుకమ్మ ఎప్పుడు కూడా అలిసిపోదన్నారు. కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, మహిళాలు పాల్గొన్నారు.

## కబళించిన మృత్యువు

- రోడ్డు దాటే క్రమంలో బైక్‌ను ఢీకొట్టిన కర్ణాటక ఆర్టీసీ బస్సు
- ఒకే కుటుంబానికి చెందిన నాలుగురు మృతి
- సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ మండలం గణేశ్‌పూర్‌లో విషాదఛాయలు
- సంఘటనా స్థలాన్ని సందర్శించిన జహీరాబాద్ డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి



జగన్నాథ్, రేణుక, వినయ్‌కుమార్, సిద్రామప్ప(ఫైల్)

జహీరాబాద్, అక్టోబర్ 7: బస్సు బైక్‌ను ఢీకొట్టడంతో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మృతి చెందిన ఘటన సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ మండలం గణేశ్‌పూర్‌లో చోటుచేసుకుంది. హద్నూర్ పోలీసులు, గ్రామస్తుల వివరాల ప్రకారం.. మండలంలోని గణేశ్‌పూర్‌కు చెందిన గునెల్లి సిద్రామప్ప(71), అతడి అల్లుడు జగన్నాథ్(42), కూతురు రేణుక(36), మనుమడు వినయ్‌కుమార్(15) కలిసి సోమవారం పొలానికి వెళ్లారు. సాయంత్రం అందరూ కలిసి బైక్‌పై (కేఏ38 ఎల్8456) ఇంటికి వస్తున్నారు. ఇంటికి చేరుఎకునే క్రమంలో బీదర్-జహీరాబాద్ ప్రధాన రోడ్డు మార్గంలో ఎదురుగా జహీరాబాద్ నుంచి బీదర్‌కు వెళ్తున్న కర్ణాటకకు చెందిన బస్సు(కేఏ38ఎఫ్1155) బైక్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో సిద్రామప్ప అక్కడికక్కడే మృతి చెందగా, జగన్నాథ్, అతడి భార్య రేణుక, కుమారుడు వినయ్‌కుమార్‌ను చికిత్స కోసం బీదర్ దవాఖానకు తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మృతి చెందారు. ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు నెలకొన్నాయి. సిద్రామప్పకు ఇద్దరు భార్యలు ఉన్నారు. అయితే ఆయనకు రేణుక ఒక్కరే కూతురు కావడంతో గ్రామానికి చెందిన బీరదార్ జగన్నాథ్‌ను ఇల్లరికం తీసుకువచ్చారు. జగన్నాథ్, రేణక దంపతులకు ఒక కుమారుడు, ముగ్గురు ఆడపిల్లలు ఉన్నారు.

**ఘటనా స్థలాన్ని సందర్శించిన డీఎస్పీ**

జహీరాబాద్ డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి, రూరల్ సీఐ హనుమంతు, హద్నూర్ ఎస్సై రామానాయుడు బీదర్, జహీరాబాద్ ప్రభుత్వ దవాఖానలను సందర్శించారు. మృతుల కుటుంబసభ్యులను పరామర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## రాజకీయ లబ్ధి కోసమే డ్రామాలు



సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లో మాట్లాడుతున్న బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి

- ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ నాయకులు అక్రమంగా చొరబడటం దారుణం
- బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్, అక్టోబర్ 7:కాంగ్రెస్ నాయకులు డ్రామాలు ఆడుతూ అధిష్ఠానం దగ్గర మెప్పు పొందేందుకు చిల్లర రాజకీయాలు చేస్తూ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అక్రమంగా చొరబడి సీఎంఆర్ఎఫ్, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ ఫైళ్లను అపహరిస్తూ రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్నారని బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్ రెడ్డి అన్నారు. సోమవారం సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్‌లో ఆధిపత్యాన్ని నిలబెట్టుకోవడానికి, పత్రికల్లో కనిపించడానికి రెండు గ్రూపుల నాయకులు నామినేటెడ్ పదవులు పొందేందుకు ఒకరి మీద ఒకరు పోటీ పడి ఫిర్యాదులు చేసుకుంటున్నారని మండిపడ్డారు. కొంత మంది అక్రమంగా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో చొరబడి దాడి చేయడంపై తీవ్రంగా ఖండించారు. కాంగ్రెస్ వాళ్లకు పడక గ్రూపులుగా ఏర్పడి బీఆర్ఎస్‌పై బురదజల్లడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కల్యాణలక్ష్మి చెక్కులను మంత్రులు, కలెక్టర్, ఆర్డీవోలు ఇవ్వాలన్నారు. అధికారులు గజ్వేల్ నియోజకవర్గానికి సంబంధించిన చెక్కులను తమ ఎమ్మెల్యే కేసీఆర్‌కు అందజేస్తే 24 గంటల్లో ప్రతి లబ్ధిదారుడి ఇంటికెళ్లి అందజేస్తామని తెలిపారు. నేడు ఉదయం 10 గంటల వరకు గ్రామాల్లోని లబ్ధిదారులకు చెక్కులు అందేవిధంగా అధికారులు చొరవ చూపాలని, లేని పక్షంలో 9వ తేదీన ఉదయం 11గంటలకు ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తామని హెచ్చరించారు. అనంతరం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అక్రమంగా చొరబడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని గజ్వేల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సమావేశంలో గజ్వేల్ మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, మాజీ ఏఎంసీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బెండే మధు, మాజీ జడ్పీటీసీ మల్లేశం, వైస్ చైర్మన్ జకీయొద్దీన్, ఆత్మకమిటీ మాజీ చైర్మన్ కృష్ణారెడ్డి, విరాసత్, శ్రీనివాస్ రెడ్డి, దయాకర్‌రెడ్డి, కనకయ్య, అత్తెల్లి శ్రీను, బొగ్గుల చందు, మామిడి శ్రీధర్, మద్ది రాజిరెడ్డి, రమేశ్‌గౌడ్ పాల్గొన్నారు.




మెదక్‌లో బతుకమ్మ ఆడుతున్న మంత్రులు కొండా సురేఖ, సీతక్క

## తెలంగాణ సంస్కృతికి ప్రతీక బతుకమ్మ

### మంత్రులు కొండా సురేఖ, సీతక్క

మెదక్, అక్టోబర్ 7 (నమస్తే తెలంగాణ): బతుకమ్మ పండుగ మన సంస్కృతికి ప్రతీక అని అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖల మంత్రి కొండా సురేఖ అన్నారు. మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ సోషల్ సర్వీస్ ఆధ్వర్యంలో సోమవారం మెదక్ పట్టణంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల మైదానంలో బతుకమ్మ ఉత్సవాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో మంత్రులు కొండా సురేఖ, సీతక్క పాల్గొన్నారు. మంత్రులు మహిళలు, యువతులతో కలిసి బతుకమ్మ ఆడారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ ..తెలంగాణ ఆడపడుచులు ఎంతో భక్తి శ్రద్ధలతో బతుకమ్మ జరుపుకుంటారన్నారు. ప్రకృతితో మమేకమయ్యే పండుగ బతుకమ్మ అని కొనియాడారు. ప్రపంచంలో పూలను పూజించే సంస్కృతి తెలంగాణలో మాత్రమే ఉందన్నారు. అనంతరం సింగర్ మంగ్లీ పాడిన బతుకమ్మ పాటలు అలరించాయి. ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు, మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి, ఆర్డీవో రమాదేవి, ఇతర ప్రజాప్రతినిధులతో కలిసి బతుకమ్మ ఉత్సవాలు నిర్వహించారు.



సిద్దిపేట కలెక్టరేట్‌లో బతుకమ్మ ఆడుతున్న మహిళా ఉద్యోగులు, బతుకమ్మలతో వస్తున్న కలెక్టర్ మనుచౌదరి, అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

## సిద్దిపేట కలెక్టరేట్‌లో బతుకమ్మ సంబురాలు

సిద్దిపేట కలెక్టరేట్, అక్టోబర్ 7: సిద్దిపేట కలెక్టరేట్ ఆవరణంలో సోమవారం బతుకమ్మ సంబురాలు అంబరాన్నంటాయి. కార్యక్రమానికి సిద్దిపేట కలెక్టర్ మనుచౌదరి, అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి హాజరయ్యారు. బతుకమ్మలకు పూజలు చేసిన అనంతరం కలెక్టర్ అధికారులతో కలిసి బతుకమ్మ, కోలాటం ఆడారు. బతుకమ్మ సంబురాల్లో అన్ని శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

### సింగూరుకు కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

పుల్కల్,అక్టోబర్ 7: సంగారెడ్డి జిల్లా పుల్కల్ మండలంలోని బాగారెడ్డి సింగూరు ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో కొనసాగుతున్నది. సోమవారం కూడా రెండు గేట్ల ద్వారా అధికారులు నీటిని దిగువకు విడుదల చేశారు. ప్రాజెక్టు 6,11 గేట్లు ఎత్తి 10,687 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. ఇన్‌ఫ్లో19,141 క్యూసెక్కులు వస్తుండగా, అవుట్ ఫ్లో 14,141 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేసినట్లు ఏఈ మహిపాల్‌రెడ్డి తెలిపారు. ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 29.917 టీఎంసీలు ఉండగా, ప్రస్తుతం 29.541 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు వెల్లడించారు.



అర్జీలు స్వీకరిస్తున్న సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి

## సమస్యలకు సత్వర పరిష్కారం చూపాలి

### సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి కలెక్టరేట్, అక్టోబర్ 7: ప్రజావాణి సమస్యలకు తక్షణమే పరిష్కారం చూపాలని సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి అధికారులను ఆదేశించారు. సోమవారం సంగారెడ్డి కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో భాగంగా బాధితుల నుంచి ఆమె అర్జీలు స్వీకరించారు. అనంతరం ఆమె మాట్లాడారు.వివిధ ప్రాంతాల నుంచి 55 మంది దరఖాస్తు చేసుకున్నారని, వాటిని వెంటనే పరిష్కరించాలన్నారు. శాఖల వారీగా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌లో సజావుగా క్లియర్ చేయాలన్నారు. క్షేత్రస్థాయిలో మండల ప్రత్యేకాధికారులు పర్యటించి ప్రజా సమస్యలను పరిష్కరించాలన్నారు. సీజనల్ వ్యాధులపై ప్రజలను అప్రమత్తం చేయాలని, అందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. సమస్యల పరిష్కారానికి అధికారులు త్వరగా స్పందించి సత్వర పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో సంగారెడ్డి అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, డీఆర్‌వో పద్మజారాణి, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ప్రత్యేక చొరవతో సమస్యలు పరిష్కరించాలి

### సిద్దిపేట అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

సిద్దిపేట కలెక్టరేట్, అక్టోబర్ 7: అధికారులు ప్రత్యేక చొరవ చూపి ప్రజావాణిలో వచ్చే అర్జీదారుల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని సిద్దిపేట అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. సోమవారం సిద్దిపేట సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని సమావేశ మందిరంలో ప్రజావాణి నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి తమ సమస్యలు విన్నవించుకోవడానికి వచ్చిన అర్జీదారుల నుంచి ఆయన దరఖాస్తులు స్వీకరించారు. భూ సంబంధిత, ఇండ్లు, ఆసరా పింఛన్లపై 22 దరఖాస్తులు వచ్చాయి. కార్యక్రమంలో డీఆర్‌వో లక్ష్మీకిరణ్,డీఆర్డీవో జయదేవ్ ఆర్యా, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



సిద్దిపేట సమీకృత కార్యాలయంలో అర్జీలు స్వీరిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి



దరఖాస్తులు స్వీకరిస్తున్న మెదక్ అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

## బాధితులకు న్యాయం చేయాలి

మెదక్, అక్టోబర్ 7(నమస్తే తెలంగాణ): ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను పరిష్కరించి, బాధితులకు న్యాయం చేయాలని మెదక్ అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు అధికారులను ఆదేశించారు. సోమవారం ఐడీవోసీ కార్యాలయంలో ప్రజావాణి నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. అనంతరం మాట్లాడుతూ..దరఖాస్తులను పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలు నేరుగా సమస్యలను అధికారులకు చెప్పుకునే వేదికగా ప్రజావాణి ఉపయోగపడుతుందన్నారు. జిల్లాలోని ప్రజలకు మెరుగ్గా సేవలు అందించేందుకు అధికారులు కృషి చేయాలని సూచించారు. 55 ఫిర్యాదులు వచ్చాయని, ఇందులో ధరణి 15, పింఛన్లు 1, పంట రుణమాఫీ 4, డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు 6, ఇతర సమస్యలపై 29 దరఖాస్తులు వచ్చాయన్నారు. కార్యక్రమంలో డీఆర్డీవో శ్రీనివాసరావు, జడ్పీసీఈవో ఎల్లయ్య, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.